క్లుప్తంగా

సమస్యలపై సీఎంకు వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎంను వారు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ క్రమబద్ధీకరణ జీఓ 76ను పునరుద్ధరించాలని, నిలిచిన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు, ఇల్లెందుల పాడు చెరువు ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు స్వర్ణ కంకణం బహూకరణ



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు స్వర్ణ కంకణం, జై భారత్ జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు. ఆదివారం కరీంనగర్ ఫిలిమ్ భవన్‌లో శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో జై భారత్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ దూడపాక శ్రీధర్, అతిథులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, ప్రముఖ కవి భవానీ, రాణి రుద్రమల చేతుల మీదుగా విద్యారంగంలో విశేష సేవలు అందించిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ వెంకటేశ్వరరావుకు స్వర్ణ సింహ కంకణం బహూకరించి, జాతీయ స్థాయి పురస్కారంతోపాటు, మెమెంటోను అందజేశారు. ఈ విషయాన్ని అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు.

పారితోషికం చెల్లించండి..



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇల్లెందు: ఎన్నికల ముందు నుంచి బీఎల్‌ఓ డ్యూటీలు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం నుంచి పారితోషికం విడుదల కావటం లేదని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్లతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫాతిమా, కుమారి, మరియ, సుజాత అరుణ ఉన్నారు.

డీర్‌పార్క్‌ను సందర్శించిన ఎఫ్‌డీఓ



పార్క్ సిబ్బందితో మాట్లాడుతున్న బాబు

పాల్వంచరూరల్: పాల్వంచ వన్యమృగాల సంరక్షణ విభాగం డివిజన్ ఎఫ్‌డీఓగా బాధ్యతలు చేపట్టిన బి.బాబు సోమవారం కిన్నెరసానిలోని జింకల పార్క్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్ సిబ్బందితో మాట్లాడి జింకల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్యావరణ కేంద్ర భవనాన్ని సందర్శించి మ్యూజియంలోని జంతువుల బొమ్మలను తిలకించారు. ఎఫ్‌డీఓ వెంట రేంజర్ శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్ హారిక, బీట్ ఆఫీసర్ రవికుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోమలకు తీవ్రంగా గాయాలయ్యాయి. రొంపేడు గ్రామానికి చెందిన నలుగురు కూలీలు వ్యవసాయ కూలీ పనులకు ఆటోలో కొమరారం వెళ్తుండగా ఆటో ముందు చక్రం ఊడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. కోమలను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఖమ్మం సిఫారసు చేశారు.

ఇందిరమ్మ సరే.. 'డబుల్' సంగతి?

- నియోజకవర్గానికి రూ.20 కోట్లతో 400 ఇళ్లు
- ఏళ్లుగా పిల్లర్లకే పరిమితం



ఇల్లెందులో పునాదులకే పరిమితమైన డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టింది. అయితే గత ప్రభుత్వం హయాంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం సంగతేంటి పేదలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం మలి విడత ఇల్లెందు నియోజకవర్గంలో ఫేజ్–2 లో 400 ఇళ్లను మంజూరు చేసింది. కానీ ఏ ఒక్క చోటా నిర్మాణం పూర్తి కాలేదు. ఇందిరమ్మ పథకంతో పాటు డబుల్ బెడ్ రూం ఇళ్లు, రాజీవ్ స్వగృహ పథకాలను అటకెక్కిస్తారా పేదల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇల్లెందు పట్టణంలో 240 ఇళ్లు...

మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో వార్డుకు 10 ఇళ్ల కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల ముందు ఇళ్లు ఇస్తామని వార్డుల్లో ఓటర్లను ప్రలోభపెట్టారు. ఎన్నికలు ముగిసినా తరువాత ఓడ మల్లయ్య.. బోడ మల్లయ్య అన్న చందంగా బీఆర్‌ఎస్ వదిలేసింది. పట్టణంలోని హరిహరక్షేత్రం వద్ద 10 బ్లాకులు 240 ఇళ్లకు అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ శంకుస్థాపన చేశారు. ఇసుక, సిమెంటు, నీటి సమస్యతో అతికష్టం మీద పునాదుల వరకు మాత్రమే పనులు జరిగాయి.

మండలానికి 60 ఇళ్ల కేటాయింపు...

ఇల్లెందు మండలానికి 60 ఇళ్లు కేటాయించారు. బొజ్జాయిగూడెంలో 20 ఇళ్లు, ఇందిరానగర్‌లో 20, మాణిక్యారంలో 20 ఇళ్లు నిర్ణయించారు. కానీ ఈ మూడు చోట్లా స్థలాలనే గుర్తించలేదు.

తొలి దశలో ఇలా...

తొలి విడత ఇల్లెందుకు మంజూరైన డబుల్ బెడ్ రూం ఇళ్లు మూడు చోట్ల నిర్మాణం పూర్తి చేశారు. నాలుగో చోట రొంపేడులో స్థలం లేక వదిలేశారు. ఇల్లెందుకు 80 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా సుదిమళ్ల పంచాయతీ లలితాపురంలో 20 ఇళ్లు, రాఘబోయినగూడెం పంచాయతీ ముల్కనూరులో 20 ఇళ్లు, చల్లసముద్రం గ్రామపంచాయతీ వేమలవాడలో 20 ఇళ్లు చేపట్టి పూర్తి చేశారు. రొంపేడు గ్రామపంచాయతీ 21 ఫిట్‌లో 20 ఇళ్లకు స్థలం లేక రద్దు చేశారు.

తాజాగా ఇందిరమ్మ ఇంటి పథకం ప్రారంభం..

భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. స్థలం ఉన్న వారికి తొలి దశలో రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు కేటాయిస్తామని ప్రకటించారు. ఇక స్థలం లేని వారికి మలిదశలో స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అయితే ఈ డబుల్ బెడ్ రూం ఇళ్లు, రాజీవ్ స్వగృహాలను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని పేదలు కోరుతున్నారు.

ఇందిరమ్మ పథకం బావుంది..



ఇందిరమ్మ పథకం వల్ల ఉపయోగం ఉంటుంది. స్థలం ఉన్న చోట రూ.5 లక్షలు ఇస్తే మరి కొంత జమ చేసుకుని ఇల్లు కట్టుకునే అవకాశం ఉంది. డబుల్ బెడ్ రూం ఇళ్లు వస్తాయని ఆశగా ఎదురు చూశాము కానీ, పదేళ్లలో ఇక్క ఇల్లూ రాలేదు.

– యాకుబ్ షావలీ, ఇల్లెందు

డబుల్ ఇళ్లు పూర్తి చేయాలి..



గత ప్రభుత్వం హయాంలో మంజూరైన డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు ప్రారంభించి వదిలేశారు. వాటిని కూడా పూర్తి చేసి పేదలను గుర్తించి ఇస్తే బావుంటుంది. వాటిని అలాగే వదిలేస్తే స్థలం ప్రజాధనం నిరుపయోగం అయినట్లే.

– ఎస్‌ఏ నబీ, ఇల్లెందు

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం మంగళవారం కార్యాలయంలో చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఇల్లెందు కౌన్సిల్ 2023–24 సవరణ బడ్జెట్, 2024–25 అంచనా బడ్జెట్ సమావేశం 11గంటలకు ప్రారంభం కానున్నట్లు కమిషనర్ నవీన్ సోమవారం తెలిపారు. వాస్తవిక గణాంకాల ఆర్థిక సంవత్సరం 2022–23 ఆదాయం 9.28 కోట్లు, వ్యయం 18.6 కోట్లు, బడ్జెట్ అంచనా ఆర్థిక సంవత్సరం 2023–24 ఆదాయం 40.68 కోట్లు, వ్యయం 40.67 కోట్లు, వాస్తవిక గణాంకాలు సంవత్సరం 2023 డిసెంబర్ 31 నాటికి ఆదాయం రూ.5.14 కోట్లు, వ్యయం రూ.7.14 కోట్లు, సవరించిన బడ్జెట్ అంచనాలు ఆర్థిక సంవత్సరం 2023–24 ఆదాయం రూ.12.09 కోట్లు, వ్యయం రూ.12.02 కోట్లు, ఇక బడ్జెట్ అంచనాలు ఆర్థిక సంవత్సరం 2024–25 ఆదాయం రూ.15.76 కోట్లు, వ్యయం రూ.15.45 కోట్లుగా ప్రతిపాదనలు పరిశీలించి ఆమోదించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


కేటీసీ టిప్పర్, లారీ ఓనర్లను ఆదుకోవాలి



పీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు రవాణా చేసేందుకు సదరు కాంట్రాక్టర్ తక్కువ ధరకు టెండర్ వేయడం వల్ల టిప్పర్, లారీ ఓనర్లు నష్టపోవాల్సి వస్తోందని అధికారులు చొరవ చూపి ఆదుకోవాలని కోయగూడెం ఓసీ టిప్పర్, లారీ ఓనర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కోరం సురేందర్, అధ్యక్షుడు నేలవెల్లి నరసింహారావు కోరారు. ఈ మేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కేటీసీ పీఓ ప్రహ్లాద్‌ని కలిసి శాలువాతో సన్మానించి ఓనర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేటీసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీ వరకు బొగ్గు రవాణా చేసేందుకు శ్రీదేవి ట్రాన్స్‌పోర్ట్ వారు 3.36 కిలోమటర్ల దూరం, ఒక టన్నుకి రూ.142 అతి తక్కువ ధరకే టెండర్ వేశారని, ఇది ప్రస్తుతం ఉన్న టెండర్ కంటే రూ.18 తక్కువ అని తెలిపారు. దీంతో లారీల మనుగడకే ప్రశ్నార్థకమని వాపోయారు. రోజురోజుకు టిప్పర్, లారీల విడిభాగాల రేట్లు, డీజిల్, కార్మికుల వేతనాలు పెరుగుతున్నాయని కాంట్రాక్టర్లు మాత్రం తక్కువ రేటుకే టెండర్లు వేయడం గర్హనీయమన్నారు. కేటీసీ ప్రభావిత ప్రాంతాలకు చెందిన భూనిర్వాసితులైన ఓనర్లు ప్రైవేట్ ఫైనాన్స్‌ల ద్వారా లారీలు కొనుగోలు చేసి కేటీసీపై ఆధారపడి బొగ్గు రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. ఓనర్లతో పాటుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా లారీలపై డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్ లాంటి సుమారు 10 వేల మంది జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. తక్కువ టెండర్ వల్ల వీరందరూ వీధిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓనర్లు, కార్మికుల కష్టాలు తెలియజేసినా సదరు కాంట్రాక్టర్ తన వైఖరి మార్చుకోలేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఓనర్లు, కార్మికులం రోడ్డెక్కి ధర్నాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి తమవంతు సహకారం అందించాలని పీఓను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అరవ వెంకటేశ్, ఉపాధ్యక్షుడు బోడ మంగీలాల్‌నాయక్, రామారావు, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.


ఎంఈపీఏ కమిటీ ఎన్నిక



రమేష్, శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కొత్తగూడెంటౌన్: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం (ఎంఈపీఏ) మెప్మా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొత్తగూడెంకు చెందిన సుప్పరి రమేష్, చుంచుపల్లికి చెందిన కాసబోయిన శ్రీనివాస్‌లను నియమించినట్లు ఎంఈపీఏ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవ్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఏంఈపీఏ మెప్మా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు వారికి నియామకపత్రాలు అందజేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఎదుట ధర్నా



జూలూరుపాడు: బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు: ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించేందుకు మరింత సమయం కావాలని ఎస్‌బీఐ చేసిన విజ్ఞప్తి లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు ఇవి బహిరంగ చేయకుండా ఉండేందుకు వ్యూహం అని సీపీఎం మండల కార్యదర్శి టి.కృష్ణ అన్నారు. సోమవారం ఇల్లెందులో ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం ఒత్తిడి మేరకు ఎస్‌బీఐ వివరాలు ఇవ్వడం లేదన్నారు. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మార్చి 6 లోగా ఎన్నికల కమిషన్‌కు బాండ్ల వివరాలను అందించడంలో ఎస్‌బీఐ విఫలం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం మోహన్‌రావు, సంతోష్, కౌలస్య, కోటమ్మ, వెంకన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం జూలూరుపాడు ఎస్‌బీఐ బ్రాంచి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు ఇచ్చే ఫండింగ్ వ్యవహారాల్లో ఎలక్టోరల్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. బీజేపీ రూ.వేల కోట్ల ఫండింగ్ తీసుకుంటూ దేశసంపదను కార్పొరేట్‌కు దోచుపెడుతోందని విమర్శించారు. ఇదేందటని ప్రశ్నించిన వారిపై దేశద్రోహం కేసు పెట్టి జైలుకు పంపిస్తున్నారని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఆ బాండ్ల విధానం తప్పని ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. బాండ్ల వివరాలను ఎస్‌బీఐ చైర్మన్ తక్షణమే వెల్లడించాలని, లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బానోత్ ఇస్రా, లకావత్ శ్రీను, గార్లపాటి వెంకటి, బోడా అభిమిత్ర పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పాల్వంచ: మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. మంచికంటి నగర్, మసీదు గుట్ట, చింతల చెర్వు, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, బాపూజీనగర్, నెహ్రూనగర్, ప్రశాంత్ కానీ, వనమా కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.

వేతనాలివ్వండి..

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎం, డాక్టర్లు, ఫార్మాసిస్ట్, ఎల్‌టీ, స్టాఫ్ నర్స్, డీఈఓ, కంటింజెన్సీ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వటంలేదని, తక్షణమే వేతనాలు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏఓ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం మెరుగు పరిచే హెల్త్ డిపార్ట్‌మెంట్ వర్కర్లకు వేతనాలు లేకపోతే ఎలా పని చేస్తారో సీఎం ఆలోచించాలన్నారు. సీఎం జోక్యం చేసికొని తక్షణమే వేతనాలు అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. కౌసల్య, మణి, నాగమణి, తులసి, విజయ మంగమ్మ, రాణి, పార్వతి పాల్గొన్నారు.

నేడు ఇంటి స్థలాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి 4వ వార్డులో ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా మంగళవారం జరుగుతుందని చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 8.30 గంటలకు ప్రారంభం అవుతుందని వివరించారు. 10.30 గంటలకు మున్సిపల్‌లో బడ్జెట్ సమావేశం, మధ్యాహ్నం మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందన్నారు. సాయంత్రం మహిళా దినోత్సవ వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. 13వ తేదీన పట్టణ పరిధిలో డీఎంఎఫ్, 14వ ఫైనాన్స్ కమిషన్, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టనున్న పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా జరుగుతాయని తెలిపారు.

'ఉపాధి' అవకతవకలపై ఫిర్యాదు చేయొచ్చు..



గ్రామసభను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: రెండురోజులుగా మండలంలోని గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న 15వ విడత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022–2023 సంవత్సరానికి సంబంధించి నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ గ్రామసభలను సోమవారం ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే సభలో ఫిర్యాదు చేయవచ్చని ఎంపీడీఓ సూచించారు.

వందరోజుల 'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

ఉపాధి హామీ పథకంలో కూలీలు వందరోజుల పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. కేశవాపురంలో నర్సరీని సోమవారం ఎంపీడీఓ పరిశీలించారు. నాగారంకాలనీలో ఉపాధి పనులను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనిలో ప్రతీకూలీ వందరోజులు ఉపయోగించుకుని రోజుకు రూ.272 వేతనం పొందేవిధంగా పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కనకదుర్గ, అబ్జర్వర్ దేవదాసు, ఏపీఓ పొరండ్ల రంగా, గ్రామ కార్యదర్శులు మౌనిక, కృష్ణవేణి, సతీష్ క్షేత్రసహాయకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్

టేకులపల్లి: రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, లాభసాటి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన దృశ్య శ్రవణ (వీడియో కాన్ఫరెన్స్) విధానాన్ని ఈనెల 6న ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మంగళ, శుక్రవారాల్లో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులోని రైతు వేదికలో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుందని టేకులపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిణి నీరుడు అన్నపూర్ణ తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు దృశ్య శ్రవణం ద్వారా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ప్రస్తుత వ్యవసాయ పంటలలో అధిక ఉష్ణోగ్రత ప్రభావం నుంచి పంటలను రక్షించేందుకు, మామిడిలో పిందె రాలుట, నివారణ చర్యలు గురించి చర్చలు, సలహాలు, సూచనలు ఉంటాయన్నారు. రైతులు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



పాల్వంచ: సభకు వెళ్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: సీఎం సభకు వెళ్తున్న పొదుపు సంఘాల మహిళలు

పాల్వంచ: మణుగూరులో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాదీవెన సభకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు కార్లు, బస్సులు, ఆటోల్లో సభకు వెళ్లారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, జాలే జానకిరెడ్డి, కొండం వెంకన్న, బద్ది కిశోర్, కందుకూరి రాము, దారా చిరంజీవి, పుల్లి సత్యనారాయణ, బత్తుల వెంకటేశ్వర్లు, గంధం నరసింహారావు, భరత్, శాంతివర్ధన్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలు...

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండలంలోని పొదుపు సంఘాల మహిళలు భారీగా కదిలారు. ప్రారంభోత్సవ వేడుకల్లో సీఎం చేతుల మీదుగా ముగ్గురు మహిళలు మంజూరు ధ్రువీకరణ పత్రం అందుకునేలా ఆదేశాలు వెలువడటంతో మహిళలు ఉత్సాహంగా మంజూరైన మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల నుంచి పొదుపు సంఘాల మహిళలు ప్రత్యేక వాహనాల్లో సీఎం సభకు మణుగూరుకు తరలివెళ్లారు.

లక్ష్మీనారాయణ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్‌వసంత్

కొత్తగూడెంటౌన్: సీనియర్ న్యాయవాది బొల్లెపల్లి లక్ష్మీనారాయణ మరణించడం దురదృష్టకరమని ఆయన సేవలు మరువలేనివని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు హాల్‌లో జరిగిన ఫుల్‌కోర్టు రిఫరెన్స్‌లో న్యాయమూర్తి మాట్లాడుతూ.. రైతు కుటుంబంలో జన్మించిన బొల్లెపల్లి తన 92 ఏట మరణించాడని, న్యాయమూర్తిగా, యువ న్యాయవాదులకు ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలు నిర్దోషులుగా బయటపడినప్పటికీ వారిని మళ్లీ నేరాలు చేయొద్దని మందలించే వాడన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి డాక్టర్ శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సీట్ బత్తుల రామారావు, రెండో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, మూడో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.శివనాయక్, ఏజీపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు..

బార్ అసోసియేషన్ సంతాపం..

సీనియర్ న్యాయవాది బొల్లెపల్లి లక్ష్మీనారాయణ మరణం తీరని లోటని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ ఆధ్వర్యంలో సంతాపం తెలియజేశారు. న్యాయవాదులు బి.రామచంద్రయ్య, ఆర్.వెంకటరత్నం, పి.సాంబశివరావు, ఉదయ్‌భాస్కర్, గణేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?



టేకులపల్లి సెంటర్‌లో తవ్విన గుంతలు

టేకులపల్లి: నెట్‌వర్క్ కేబుల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ఎప్పుడూ రద్దీగా ఉండే మండల కేంద్రంలోని సెంటర్‌లో వారం రోజుల క్రితం షాపుల ఎదురుగా, రోడ్డు వెంబడి గుంతలు తవ్వారు. కానీ నేటికీ పూడ్చలేదు. పని పూర్తి అయిందో లేదో కూడా తెలియని పరిస్థితి. టేకులపల్లి నుంచి వెంకట్యాతండా మధ్యలో రోడ్డు వెంబటి కూడా గుంతలు తవ్వారు. రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ గుంతల కారణంగా ఇప్పటికే పలువురు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలయ్యారు. గత నెల 26న ఇల్లెందు మండలం మామిడిగూడెం వద్ద ఇలాంటి గుంతలోనే ఓ ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదాలు జరగక ముందే గుంతలను పూడ్చి వేయాలని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జీఎం కవితానాయుడు



మాట్లాడుతున్న జడ్జి భానుమతి

సింగరేణి(కొత్తగూడెం): మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని ఇటీవల సింగరేణిలో జరిగిన పలు రిక్రూట్‌మెంట్‌లలో మహిళలు అన్ని విభాగాలలో ఉద్యోగం సంపాదించారని జీఎం పర్సనల్ (ఈఈసెల్, సీఎస్సార్) కవితానాయుడు అన్నారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమ కన్వీనర్ కట్టా బసవయ్య (జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్సీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా వై.సరస్వతి బసవయ్య, కవితా నాయుడు మాట్లాడుతూ మహిళలు కుటుంబ పోషణలో, పిల్లల అభివృద్ధిలో తమవంతు కృషి చేయాలన్నారు. సమాజంలో మహిళలు ధైర్యసాహసాలతో విపత్తులను ఎదుర్కోవాలని, మహిళా సాధికారతకు కృషి చేయాలని, స్త్రీ ఒక వ్యక్తికాదు, ఒక శక్తి అన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం వై.సరస్వతి బసవయ్య, ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణి సీతాప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఆటలపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళా ఉద్యోగులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ టి.శ్రీనివాస్‌రావు, పి.కిరణ్మయి, బి.సుమలత, డి.శారద, కే.రమ, ఏ.విజయకుమారి, జీబీ అరుణకుమారి, కే.శైలజ, ఎస్.ఉష, బి.మౌనిక, ఏ.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మహిళ లక్ష్యాలను ఎంచుకోవాలి...

ప్రతీ మహిళ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ భద్రాద్రి కొత్తగూడెం జి.భానుమతి అన్నారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఏరియా సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి షాలేంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథిగా రేపాక సాత్విక (గైనకాలజిస్ట్, మాత శిశు ఆస్పత్రి) హాజరయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, పట్టుదలతో చదివి, ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఇప్పటికే మహిళల్లో చైతన్యం వచ్చిందని, మున్ముందు కూడ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. జడ్జి భానుమతి, డాక్టర్ రేపాక సాత్విక, గౌతంపూర్ వాసి రత్నమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, ఎంపీటీసీ ఆర్తిమక్కడ్, డీజీఎం ఐఈడీ యోహాన్, డీవైపీఎం ఎం.శ్రావణ్, కుమార్, సేవాల సెక్రటరీలు అనిత, ఆదిలక్ష్మి, భూలక్ష్మి, నాగమణి, ఫాతిమా రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గాాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148